క్లుప్తంగా

నేడు మరిడిమాంబ పరస

మల్కాపురం: మల్కాపురం గ్రామదేవత మరిడి మాంబ అమ్మవారి (కాకి అప్పన్న) పరసను బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవంలో భాగంగా ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మల్కాపురం వీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. పరస వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మల్కాపురం పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి పూజల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొనున్నారు.

24న ఐటీఐలో జాబ్ మేళా

పెదగంట్యాడ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పాస్ అయిన, అప్రెంటిస్ పూర్తి చేసిన అభ్యర్థులకు తిరుపతిలోని అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.21వేల జీతంతో పాటు వసతి, భోజనం, బస్సు సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24న ఐటీలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177338977 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ శవానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కేజీహెచ్ ఇన్‌గేట్ బస్‌స్టాప్ వద్ద అనాథ వృద్ధుడు చనిపోయాడు. దీంతో మహారాణిపేట పోలీసులు మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే స్పందించి జ్ఞానాపురం జీవీఎంసీ శ్మశాన వాటిక వద్ద అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. మమత సేవలను పలువురు అభినందించారు.

మూగజీవాల ఆరోగ్య ప్రదాయిని



కుక్కకి శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్

- గాంధీగ్రామం పశువుల ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు
- పాడిరైతులు, పెంపకందారుల సంతృప్తి



గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి ప్రాంగణం

సింథియా: మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ పాడిరైతులకు అండగా నిలుస్తోంది గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి. హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఆధీనంలోని ఈ ఆస్పత్రిని సంస్థ సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేయడంతో పశువులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ అందిస్తున్న సేవలపై పాడిరైతులు, పెంపకందారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వైద్యసేవలు ఇలా..

- ఈ ఆస్పత్రిలో రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పశువైద్య సేవలను అందిస్తున్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, వివిధ రకాల శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారు.
- పశువులు మృతి చెందితే వాటి పోస్టుమార్టం నివేదిక అందించడం, బీమా కొరకు పత్రాలను మంజూరు చేస్తున్నారు.
- పశువుల కృత్రిమ గర్భధారణకు వైద్యం అందిస్తున్నారు.
- పశు ఆరోగ్య శిబిరాలు, పశుగణన వంటి కార్యక్రమాలను ఆస్పత్రి సిబ్బంది నిర్వహిస్తున్నారు.

వైద్యసేవలు బాగున్నాయి



ఆస్పత్రిలో సేవలు బాగున్నాయి. మా పెంపుడు పిల్లికి సుస్తీ చేస్తే గాంధీగ్రామం పశువుల ఆస్పత్రికి తీసుకు వచ్చాను. డాక్టర్ సునీల్‌కుమార్ పరీక్షించి, చిన్న శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. గంటలో చేసి ఇంటికి పంపించారు. ఇప్పుడు పిల్లి ఆరోగ్యం కుదుటపడింది.

– బషీర్, మల్కాపురం

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చకచకా



సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి చంద్రనగర్‌కు వెళ్లే ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో పిల్లర్ల నిర్మాణం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పండగ సమయంలో ఆగినా మళ్లీ ఊపందుకున్నాయి. ఇప్పటికే ప్లాట్ ఫారాలపై షెడ్ల నిర్మాణం పూర్తయింది. బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లు వేస్తున్నారు. గోపాలపట్నం నుంచి చంద్రనగర్‌కు వెళ్లే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఇక్కడ పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం దీనికి కొంత మేర అదనపు సపోర్టుతో ఉపయోగిస్తున్నారు. పిల్లర్ల నిర్మాణం తర్వాత పాత బ్రిడ్జి కూల్చి వేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రనగర్ కొత్తపాలెం వాసులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

16 గ్రామాలకు సౌకర్యం

ఈ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయితే కొత్తపాలెం నరవ ప్రాంతాలైన సుమారు 16 గ్రామాల ప్రజలకు ఎంతోసౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ఆధునికీకరణ పనులను రూ.9.98 కోట్లతో చేపడుతున్నారు. సింహాచలం దేవస్థానం గాలి గోపురం నమూనాతో స్టేషన్ నిరాణం చేస్తున్నారు.



ప్లాట్‌ఫారాలపై నూతనంగా నిర్మించిన షెడ్లు



స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కోసం ..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మిలటరీకాలనీ ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని మిలటరీకాలనీ స్థలాలను, ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పొంద్రంగి జయరాజ్, వరప్రసాద్, హేమంత్‌కుమార్, సునీల్ పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్టీ రత్నాకర్ పర్యటనకు ఏర్పాట్లు



సత్యసాయి కేంద్రంలో పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న లక్ష్మణరావు

ఉక్కునగరం: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. రత్నాకర్ ఈ వారంలో ఉక్కు నగరం సత్యసాయి సేవా కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు మంగళవారం ఉక్కునగరం విచ్చేశారు. పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఉక్కునగరం సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఇతర పదాధికారులకు పలు సూచనలు చేశారు. పర్యటన విజయవంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ప్రహరీ తొలగింపు



నందమూరినగర్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీని తొలగించిన రెవెన్యూ అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నందమూరి నగర్‌లో సర్వేనంబర్76లో గెడ్డపోరంబోకు స్థలంలో స్థానికుడు నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. ఇటీవల పండగ సెలవులు రావడంతో కబ్జాకు తెరలేపారు. ఈ స్థలం సుమారు170 గజాలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ స్థలంలో రజకులకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అలాగే ధోబీ ఘాట్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సర్వే చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే కబ్జాదారుల కన్ను ఈ స్థలంపై పడింది. పండగ సెలవులను అదునుగా చేసుకుని ప్రహరీ నిర్మించేశారు. స్థానికుల ఫిర్యాదుతో గోపాలపట్నం వీఆర్వో సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సచివాలయ రెవెన్యూ కార్యదర్శులు సిబ్బంది తొలగించేశారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై భారం!

8 రెట్లు పెరగనున్న హెల్త్‌స్కీం భారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై వైద్య ఖర్చుల భారం పెంచడానికి యాజమాన్యం సన్నద్ధమవుతోంది. దీని కోసం కొత్త స్కీం సిద్ధం చేశారని.. అనుమతి లభించిన వెంటనే అమలు చేయడానికి సిద్ధమయ్యారనే సమాచారం విశ్రాంత ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.

ఇదీ పరిస్థితి

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఈ స్కీమ్ ద్వారా ఉద్యోగితో పాటు భార్యకు రూ. 1300 చొప్పున ఏడాదికి రూ. 2600 చెల్లిస్తున్నారు. తద్వారా భార్యభర్తలు రూ. 3 లక్షల చొప్పున హెల్త్ ఇన్సూరెన్స్ పొందుతారు. అదే విధంగా అవుట్ పేషంట్‌గా చెరో రూ. 8 వేల వరకు వైద్య ఖర్చులు పొందవచ్చు. ఇందు కోసం యాజమాన్యం ఏటా రూ. 30 కోట్లు వ్యయం చేస్తోంది. అయితే యాజమాన్యం ఆర్ఐఎన్ఎల్ గ్రూప్ మెడికల్ స్కీమ్ పేరిట మార్చిన నూతన స్కీంలో రిటైర్డ్ ఉద్యోగి ప్రతీ ఏడాది చెరో రూ.10 వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. అదే విధంగా అవుట్ పేషంట్ చార్జీల పరిమితిని రూ. 4 వేలకు తగ్గించారు. నూతన స్కీం అమల్లోకి వస్తే సుమారు 10 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రస్తుతం చెల్లిస్తున్న దాని కన్నా 8 రెట్లు ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని సమాచారం. స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు సరాసరి రూ. 2 వేలు మాత్రమే పెన్షన్ వస్తుంది. నూతన మెడికల్ స్కీమ్ వల్ల సంవత్సరం పెన్షన్ సొమ్మును మెడికల్ ఇన్సూరెన్స్ కోసం వెచ్చిస్తే ఎలా బతకాలని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాతపాలసీ కొనసాగించాలని కోరుతున్నారు.

అందరి సహకారంతోనే సముద్ర తాబేళ్ల సంరక్షణ

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ శాఖలో పలు ప్రభుత్వ శాఖలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. తెగిపోయిన వలలు, తాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఒడ్డుకు తీసుకురావాలని అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, నెట్ ఫిష్ కోఆర్డినేటర్ హనుమంతరావు అవగాహన కల్పించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తాబేళ్ల సంరక్షణలో భాగంగా చేపల వలల నుంచి సురక్షితంగా తప్పించుకోవడానికి వలల్లో టెడ్ పరికరాన్ని అమర్చి వేట సాగించాలన్నారు. సీఐఎఫ్‌టీ కొత్తగా తయారు చేసిన ఆ పరికారాన్ని ప్రదర్శించారు. విద్యుత్ దీపాల ద్వారా ఫిషింగ్ చేయరాదని, దీని వల్ల మత్స్య సంపద తగ్గిపోయే ప్రమాదం ఉందని ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి మాట్లాడుతూ సముద్ర తీరంలో చిరిగిపోయిన వలలు, తాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల తాబేళ్లు, మత్స్య సంపదకు వాటిల్లే దుష్పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ కోస్టు గార్డు ప్రధాన అధికారి మహేష్ కుమార్, మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఆశా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు



సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న తాబేళ్ల సంరక్షణ కేంద్రం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు, సాగర్‌నగర్,జోడుగుళ్లపాలెం,చేపలుప్పాడ బీచ్ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా తాబేళ్లు తీరానికి చేరుకుని గుడ్లు పెడతాయి. వీటిని సేకరించి సంరక్షణ కేంద్రాల్లో భద్రపరుస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది గుడ్లు సేకరించి భద్రపరుస్తారు. తాబేళ్ల గుడ్లను తొలుత తడి ఇసుక వేసి ఆ తరువాత రెండు పొరలుగా పొడి ఇసుక వేస్తారు. 40–45 రోజులు గడిచాక వేడికి గుడ్లు పొదిగి పిల్లలు బయటకు వస్తాయి. సముద్రంలో విడిచి పెట్టే ముందురోజు సాయంత్రం ట్రేలలో, గంపల్లో ఉంచుతారు. అవి ఉత్సాహంగా తిరిగి శక్తి సామర్థ్యాలను సంతరించుకునే వాతావరణం కల్పిస్తారు. మరుసటి రోజు సూర్యోదయం వేళ సముద్రంలోకి విడిచిపెడతారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) జి. ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక ఏవీఎన్ కళాశాలలో జరిగిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో ఆయన మాట్లాడారు. నెహ్రూ యువ కేంద్రం, జేసీఐ, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తన ప్రాణాన్ని కాపాడుకుంటూ, ఎదుటి వారి ప్రాణాలు కూడా రక్షించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించిన వారికి ప్రభుత్వం రూ.5 వేల నగదు పురస్కారం అందిస్తుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, హరి వెంకట రమణ, జేసీఐ ప్రతినిధి శ్రావణ సంధ్య, జి. మహేశ్వరరావు, లీలా ప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణకుమారి, అధ్యాపక బృందం హైమావతి, డాక్టర్ రామ్‌కుమార్, వి. స్రవంతి, ఇంగ్లీష్ విభాగధిపతి పైడి రజని అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రకుమార్ సేవలు నిరుపమానం



వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ డాక్టర్ అర్నెల్ ఈగల రవీంద్రకుమార్ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జ్ఞానాపురం విచారణ విశ్వాసిగా, కథోలిక గురువుగా 25 సంవత్సరాలు సేవలు అందించిన రెవరెండ్ ఫాదర్ డాక్టర్ అర్నెల్ ఈగల రవీంద్రకుమార్ రజిత జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ పొలిమేర జయరావు పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ రవీంద్ర ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ముందుగా వడిచర్లవీధి బాలయేసు ముఖద్వారం నుండి సెయింట్ పీటర్స్ చర్చి వరకు పుర ప్రదక్షిణ చేసి, దివ్యబలి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానాపురం విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఆలిండియా క్యాథలిక్ యూనియన్ జాతీయ కార్యదర్శి బూర రవీంద్ర శేషుబాబు, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 200 మంది సహాయ విచారణకర్తలు, ఫాదర్లు, సిస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!



కేవీ పాఠశాల నుంచి మల్కాపురం వచ్చే మార్గంలో ఇటీవల ఓ ప్రైవేట్ ఇంటర్నెట్ సంస్థ తవ్వకాలు చేపట్టింది. భూగర్భంలో అమర్చిన కేబుల్ మరమ్మతుల కోసం సేవా మార్గంలో అక్కడక్కడ రంధ్రాలు ఉంచి వాటిపై సిమెంట్ దిమ్మెలు అమర్చారు. అయితే ఇలా అమర్చిన ఓ సిమెంట్ దిమ్మ విరిగిపోయింది.దీంతో అక్కడ గొయ్యి ఏర్పడింది. ఏ మాత్రం ఏమరపాటుగా రాకపోకలు సాగించినా ప్రమాదం తప్పదు.

– మల్కాపురం

ఫోకస్

శరీర దారుఢ్య పరీక్షకు 485 మంది హాజరు



కైలాసగిరి మైదానంలో 1,600 మీటర్ల పరుగులో పోటీపడుతున్న అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి 485 మంది అభ్యర్థులు హాజరుకాగా 310 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు



జింక్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఒరిగిన స్తంభం

జీవీఎంసీ 59వ వార్డు శాంతగిరికాలనీలోని జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా విద్యుత్ షో ల్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ స్తంభం అడుగు భాగం తుప్పు పట్టి ఓ వైపు చిన్నగా ఒరిగి ఉంది. ఇది ఎప్పుడు కూలుతుందోనని భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

– మల్కాపురం